సాక్షి తిరుపతి

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



జగనన్నతోనే ముస్లింల అభ్యున్నతి

శ్రీకాళహస్తిలో ముస్లిం నేతలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. -IIలో



వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు భారీగా పెరిగాయి. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం(ఉ)
తిరుపతి	6-28	4-44
గూడూరు	6-23	4-39

న్యూస్‌రీల్

పకడ్బందీగా 'కోడ్' నిబంధనలు



ప్రవీణ్‌కుమార్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా కోడ్ నిబంధనలు అమలు చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నగదు, ఇతర వస్తువులను రవాణా చేసుకునేందుకు సరైన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ క్రమంలో అధికారులు సీజ్ చేసిన నగదుతోపాటు ఇతర వస్తువులకు అనుమతులు సక్రమంగా ఉంటే తిరిగి అప్పగించేందుకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీల ద్వారా జప్తు చేసిన ప్రతి కేసును పరిష్కరించేందుకు గ్రీవెన్స్ కమిటీ సభ్యులు స్వయంగా పరిశీలిస్తారని వెల్లడించారు. ఈ కమిటీలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి, జిల్లా ఖజానా అధికారి ఉంటారని వివరించారు. కలెక్టరేట్‌లోని బీ బ్లాక్‌లో 3వ అంతస్తులోని 306 రూమ్‌లో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి కమిటీ అందుబాటు లో ఉంటుందని చెప్పారు. తగిన ఆధారాలతో వచ్చిన వారిని విచారించి న్యాయం చేస్తారని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థితో గానీ, రాజకీయ పార్టీతో గానీ, ఎన్నికల ప్రచారంతో గానీ ఎలాంటి సంబంధం లేకుండా సీజ్ చేయబడి, ఎఫ్ఐఆర్ నమోదు చేయని వాటిపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం కమిటీ విచారిస్తుందని స్పష్టం చేశారు. సాధారణ పౌరులు, వ్యాపారులు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లాల్సి వస్తే వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 75,414 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,073 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.68 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

15 నుంచి చేపల వేట నిషేధం



నాగరాజు, మత్స్యశాఖాధికారి

తిరుపతి అర్బన్ : చేపల పునరుత్పత్తి నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటను నిషేధిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సముద్రజలాల్లో వివిధ చేపలతోపాటు రొయ్యల జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు మరియు రొయ్యలను సంరక్షించడానికి చర్యలు చేపట్టామన్నారు. నిషేధ ఉత్తర్వుల మేరకు మత్స్యకారులు వేటకు దూరంగా ఉండాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే మత్స్య సంపదతో పాటు బోట్లను స్వాధీనం చేసుకుంటామని, ప్రభుత్వ రాయితీలను రద్దు చేస్తామని హెచ్చరించారు.

నవీన తిరుపతి



తిరునగరి నవీనీకరణకు ప్రభుత్వం అత్యున్నత ప్రణాళిక రూపొందించింది. ఆధ్యాత్మిక క్షేత్రానికి అదనపు సొబగులద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. నగరానికి కనెక్టివిటీ పెంచేలా రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో గడిచిన మూడేళ్లలోనే 21 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. మరో 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏకకాలంలో సువిశాలమైన రహదారులను అందుబాటులోకి తీసుకువచ్చింది. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ మార్గాలను శివారు ప్రాంతాలకు అనుసంధానం చేస్తోంది. కొత్త రహదారులతో తిరుపతి మరో 5 వేల ఎకరాల్లో విస్తరించనుంది.

- నగరం విస్తరించేలా.. కనెక్టివిటీ పెరిగేలా.. రహదారులు
- కొత్త రోడ్లతో తిరునగరికి అదనపు సొబగులు
- అభివృద్ధితో అధికమైన భూ విలువలు
- శరవేగంగా నిర్మాణమవుతున్న నూతన భవనాలు
- కార్పొరేషన్‌కు పెరిగిన ఆదాయ వనరులు

సాక్షి, తిరుపతి డెస్క్ : ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి మహర్దశ పట్టింది. అభివృద్ధిలో సాటిలేని నగరంగా అన్ని రంగాల్లో దూసుకుపోతోంది. అత్యాధునికంగా నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరునగరం కొత్త రూపు సంతరించుకుంది. ఆయా మార్గాలు అత్యంత సుందరంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడంతో..ఇదివరకు ముళ్లపొదలతో దర్శనమిచ్చిన నగర తూర్పు ప్రాంతాలు ఇప్పుడు నివాస యోగ్యంగా మారుతున్నాయి. ఆయా రోడ్లకు ఇరువైపులా నూతన భవనాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు అభివృద్ధికి దూరంగా ఉన్న కాలనీల్లో సైతం ఇంటి స్థలాల ధరలకు రెక్కలు వస్తున్నాయి. కొత్త రోడ్ల కారణంగా ఆయా ప్రాంతాల్లోని స్థానికులు చిరువ్యాపారాలు ప్రారంభించుకుని ఉపాధి పొందుతున్నారు.

ఇది కదా అభివృద్ధి

నగరంలో ఉద్యమంలా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంపై తిరుపతి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో 50 ఏళ్ల అవసరాలే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆసక్తిగా గమనిస్తున్నారు. నగరాన్ని విస్తరించడం, ప్రస్తుతం రద్దీగా ఉన్న ప్రాంతాలపై ఒత్తిడి తగ్గించమే ప్రధాన అజెండాగా 21 మాస్టర్ ప్లాన్ రోడ్లను ప్రతిపాదించిన డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి ముందుచూపును నగర వాసులు అభినందిస్తున్నారు. ఏళ్ల తరబడి రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు తొలగిపోతుండడంపై ఆనందపడున్నారు. అభివృద్ధి అంటే ఇది కదా అంటూ ప్రశంసిస్తున్నారు.

నాడు అవకాశమున్నా.. నిర్లక్ష్యం

గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల ఒక్క రోడ్డును కూడా నిర్మించలేకపోయారు. అప్పటి ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా చైర్మెన్ నరసింహయాదవ్‌కు తిరుపతి అభివృద్ధి చేసే అవకాశం వచ్చినా నిర్లక్ష్యం వహించారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా డీబీఆర్ రోడ్డు పనులకు వీరిరువురూ రెండు మార్లు భూమి పూజలైతే చేశారు కానీ, తర్వాత పట్టించుకోలేదు. అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకకాలంలో 21 మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించడంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్లకు శ్రీకారం చుట్టిన భూమన అభినయ్‌పై అభినందలను కురుస్తున్నాయి.

ఒకేసారి 21 రహదారులు

తిరుపతికి తూర్పు ప్రాంతంలో తుడా మాస్టర్ ప్లాన్ ప్రకారం 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో వుంచుకుని ఒకేసారి 21 రోడ్ల నిర్మాణం చేపట్టారు. అందులో ఇప్పటికే 17 మాస్టర్ ప్లాన్ రోడ్లను అత్యాధునిక హంగులతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మరో నాలుగు రోడ్ల పను లు దాదాపుగా పూర్తయ్యాయి. వీటితో పాటు మరో 12 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. అలాగే చెన్నారెడ్డి కాలనీ నుంచి హరేకృష్ణ రోడ్డును, టీటీడీ ఏడీ బిల్డింగ్ పక్కన భవానీనగర్ రోడ్డు, జబ్బార్ లేవుట్ కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలోనే బాలాజీ కాలనీ, మహిళా వర్సిటీ, పద్మావతి కళాశాల, ఎమ్మార్‌పల్లె, ఎమ్మార్‌పల్లె పోలీస్ స్టేషన్ కూడళ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.


భూముల ధరకు రెక్కలు

రోడ్ల అభివృద్ధితో నగరంలో భూముల విలువ అమాంతం పెరిగాయి. ముఖ్యంగా తూర్పు ప్రాంతంలో ఇప్పటి వరకు సరైనరోడ్లు లేకపోవడంతో అంకణం రూ.70 వేలు కూడా పలికేది కాదు. అలాంటి చోట ఇప్పుడు అంకణం ఏకంగా రూ.4 లక్షల వరకు పలుకుతోంది. అలానే కొత్త రోడ్లు రావడంతో వందలాదిగా భవన నిర్మాణాలు సాగుతున్నాయి. ఆయా మార్గాల్లో వ్యాపార కార్యకలాపాలు పెరగడంతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. కొత్త భవనాల నిర్మాణాలు పెరగడంతో కార్పొరేషన్‌కు భారీగా ఆదాయం సమకూరుతోంది.

ఆదాయ వనరుగా ఆ ప్రాంతాలు

21 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ. 60 కోట్ల వరకు మున్సిపల్ కార్పొరేషన్ ఖర్చు చేసింది. రోడ్లు అందుబాటులోకి రావడంతో పలు ప్రాంతాల్లో కొత్త అపార్టుమెంట్లు, మాల్స్ నిర్మాణాలు వేగవంతం అయ్యాయి. దీంతో గడచిన రెండేళ్లలోనే సుమారు రూ.7 కోట్ల వరకు కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరింది. మరో ఐదేళ్ల తర్వాత ఏటా రూ.50 కోట్ల మేర ఈ ప్రాంతాల నుంచి మున్సిపల్ ఖజానాకు నిధులు అందనున్నాయి.

మాస్టర్ ప్లాన్ రోడ్ల వివరాలు..



కిలోమీటర్ల దూరం.. మీటర్లలోకి..

- గతంలో మునిసిపల్ పార్కు నుంచి జీవకోనకు వెళ్లాలంటే లీలామహల్ సర్కిల్ నుంచి కరకంబాడి రోడ్డు మీదుగా మూడు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. నేడు మున్సిపల్ పార్కు నుంచి జీవకోనకు 40 అడుగుల రోడ్డు అందుబాటులోకి వచ్చింది. దీంతో 700 మీటర్లు వెళితే జీవనకోనకు చేరుకునే వెసులుబాటు వచ్చింది.
- రేణిగుంట రోడ్డు నుంచి కరకంబాడి రోడ్డులోకి వెళ్లాలంటే రేణిగుంట మీదుగా అయితే దాదాపు 10 కిలోమీటర్లు, తిరుపతి మీదుగా అయితే 5, 6 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉండేది. నేడు కరకంబాడి రోడ్డు–రేణిగుంట రోడ్డును కలుపుతూ రెండు మాస్టర్‌ప్లాన్ రోడ్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కేవలం 1.5 కిలోమీటర్ల పరిధిలోనే కరకంబాడి – రేణిగుంట రోడ్లను చేరుకోవచ్చు.
- గతంలో ముత్యాలరెడ్డిపల్లె సర్కిల్ నుంచి మహిళా యూనివర్సిటీకి వెళ్లాలంటే వెస్టు చర్చి మీదుగా లేదంటే వైకుంఠపురం సర్కిల్ నుంచి వెళ్లి గాంధీపురం మార్గంలో దాదాపు 3 కిలోమీటర్లు ప్రయాణించాలి. నేడు కిలోమీటరు లోపే పంగులూరి సీతమ్మ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. భారీ వాహనాలు సైతం ఉప్పరపల్లె మీదుగా హైవేలోకి వెళ్లే అవకాశం ఏర్పడింది.
- ఇదివరకు చెన్నారెడ్డి కాలనీ నుంచి ఇస్కాన్ టెంపుల్ రోడ్డుకు వెళ్లాలంటే రుయా కూడలి లేదా వివేకానంద కూడలి మీదుగా సుమారు 3.5 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు కొత్తగా నిర్మించిన కనెక్టివిటీ రోడ్డు ద్వారా కిలోమీటర్ల దూరం మీటర్లలోకి వచ్చేసింది.



సామవాయి రోడ్డు



గోదా దేవి మార్గం



కులశేఖర ఆళ్వార్ రోడ్డు మరో వైపు

అందుబాటులోకి వచ్చిన మాస్టర్ ప్లాన్ రోడ్ల వివరాలు

వైఎస్సార్ మార్గం
- పొడవు: 1.2 కిలోమీటర్లు
- వెడల్పు : 60 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 5.6 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

అన్నమయ్య మార్గం
- పొడవు : 2.4 కిలోమీటర్లు
- వెడల్పు: 60 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 9 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

కులశేఖర ఆళ్వార్ మార్గం
- పొడవు: 1,350 మీటర్లు
- వెడల్పు: 100 అడుగులు
- డివైడర్ : 24 అడుగులు, గ్రీనరీ
- నిర్మాణ వ్యయం : రూ. 10.50 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

గోదాదేవి మార్గం
- పొడవు : 2.25 కిలోమీటర్లు
- వెడల్పు: 80 అడుగులు
- డివైడర్ : 4 అడుగులు, గ్రీనరీ
- నిర్మాణ వ్యయం : రూ. 8.95 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

శ్రీమతి పంగులూరి సీతమ్మ మార్గం
- పొడవు : ఒక కిలోమీటర్
- వెడల్పు : 80 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 5.3 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

రాణి పరాంతకాదేవి మార్గం
- పొడవు: 1.25 కిలోమీటర్లు
- వెడల్పు :60 అడుగులు
- రోడ్డు అభివృద్ధికి చేసిన ఖర్చు: రూ. 8.31 కోట్లు
- అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరా

అనంత అళ్వార్ మార్గం
- పొడవు :0.7 కిలోమీటర్లు
- వెడల్పు: 60 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 2. 67 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి మార్గం
- పొడవు: 1.25 కిలోమీటర్లు
- వెడల్పు : 80 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ .10.5 కోట్లు

తొండమాన్ చక్రవర్తి మార్గం
- పొడవు : 650 మీటర్లు
- వెడల్పు : 60 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ.3.5 కోట్లు

సామవాయి మార్గం
- పొడవు: 1.2 కిలోమీటర్లు
- వెడల్పు : 80 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 6.5 కోట్లు

కొర్లకుంట మాస్టర్ ప్లాన్ రోడ్డు
- పొడవు: 1 కిలోమీటర్
- వెడల్పు : 40 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 10 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

అక్కారాంపల్లె మాస్టర్ ప్లాన్ రోడ్డు
- పొడవు: 0.7 కిలోమీటర్లు
- వెడల్పు : 45 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 2.8 కోట్లు

గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు
- పొడవు : 0.7 కిలోమీటర్లు
- వెడల్పు : 40 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 5.5 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

తిరుమల బైపాస్-జీవకోన కూడలి రోడ్డు
- పొడవు: కిలోమీటర్
- వెడల్పు : 40 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 9.5 కోట్లు

జీవకోన రోడ్డు
- పొడవు: 0.6 కిలోమీటర్లు
- వెడల్పు: 60 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 3.5 కోట్లు

ఉపాధ్యాయ నగర్ రోడ్డు
- పొడవు: 1.2 కిలోమీటర్లు
- వెడల్పు: 40 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 8.5 కోట్లు

గొల్లవానికుంట రోడ్డు
- పొడవు: 1.5 కిలోమీటర్లు
- వెడల్పు: 60 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 8.5 కోట్లు

దాదాపుగా పూర్తయిన మాస్టర్ ప్లాన్ రోడ్లు

అన్నారావు కూడలి - తిరుమల బైపాస్ రోడ్డు
- పొడవు 0.6 కిలోమీటర్లు
- వెడల్పు: 40 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 9.5 కోట్లు
- ప్రత్యేకత : అండర్ గ్రౌండ్ విద్యుత్

అన్నమయ్య, గోదాదేవి మార్గాలను కలుపుతూ రోడ్డు
- పొడవు: 1.2 కిలోమీటర్లు
- వెడల్పు : 80 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 7.5 కోట్లు

కరకంబాడి రోడ్డు నుంచి తిమ్మినాయుడు పాళ్యం (డీమార్ట్ ఎదురుగా)
- పొడవు: 0.6 కిలోమీటర్లు
- వెడల్పు : 60 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 2 కోట్లు

కరకంబాడి రోడ్డు నుంచి తిమ్మినాయుడు పాళ్యం (ఒకటో సచివాలయం పక్కన)
- పొడవు: 0.6 కిలోమీటర్లు
- వెడల్పు: 60 అడుగులు
- నిర్మాణ వ్యయం : రూ. 2 కో3

మాటల గారడీ చేయడమే బాబు నైజం



సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- సూపర్ సిక్స్ అంటూ మరోసారి మోసం చేయడానికి బాబు వస్తున్నాడు
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులాంటివి
- అర్హతే ప్రామాణికంగా పథకాలు కొనసాగిస్తాం
- మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లి: ''సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వ లేక ఎన్నో కుట్రలు, కుతంత్రాలు, పొత్తులతో చంద్రబాబు నాయుడు జత కట్టాడు.. మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సూపర్ సిక్స్ పేరిట వస్తున్నాడు.. ప్రజలారా జాగ్రత్త.. నమ్మి మోసపోకండి'' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చౌడేపల్లె మండలంలో సిద్ధం పేరిట 19 పంచాయతీల్లో జరిగిన సభల్లో ఆయన చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మహిళలకు అభివాదం చేస్తూ పర్యటించారు. పర్యటనలో మంత్రికి మహిళలు నీరాజనాలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో 600 అబద్ధపు హామీలతో 100 పేజీల మేనిఫెస్టోను చంద్రబాబు నాయుడు విడుదల చేసినా, వాటిని అమలు చేయకుండా జన్మభూమి కమిటీల పెత్తనంతో దోచుకున్నారన్నారు. రాష్ట్రచరిత్రలో ఇచ్చిన హామీలను 100 శాతం నెరవేర్చి ప్రజలను నేరుగా ఓట్లు అడిగే అర్హత ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకే తెచ్చిన ఘనత తమదే అన్నారు. గ్రామంలోని ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి, వారి ద్వారా సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమం దేశ చరిత్రలో ఎక్కడా అమలు చేయలేదన్నారు. అలాంటి గొప్ప కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేశారని కొనియాడారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసి వైద్యసేవల కోసం కొత్తగా 58 వేల పోస్టులను భర్తీ చేశారని గుర్తుచేశారు. విద్య కోసం నాడు–నేడు ద్వారా రూ.27 వేల కోట్ల నిధులు ఖర్చు చేశారన్నారు.

పుంగనూరును ఆదర్శంగా మార్చేశాం..

ఈప్రాంతాన్ని గతంలో 30 ఏళ్లపాటు తండ్రి, కొడుకులు పాలించారని కానీ, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారని, అలాంటి ఈ ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రెండవసారి ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, పార్టీ కన్వీనర్ అంజిబాబు, పాల ఏకరి రాష్ట్ర డైరెక్టర్ లడ్డూరమణ, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, రెడ్డిప్రకాష్, నేతలు మహమ్మద్‌షఫీ, నాగభూషణరెడ్డి, అల్తాఫ్, చెంగారెడ్డి, రమేష్‌బాబు, మునికృష్ణమ నాయుడు, రఘుపతినాయుడు, శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి, ఆనందాచార్యులు, రమణారెడ్డి, ప్రమోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మరింతగా తిరుపతి అభివృద్ధే లక్ష్యం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష



పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- ప్రజల ఆదరాభిమానాలను మరువలేం
- నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తాం
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి సిటీ : తిరునగరిని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ప్రజా సహకారంతో తిరుపతిని అత్యున్నతంగా తీర్చిదిద్దుతామని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని 23, 26వ డివిజన్లలో ఎంపీ గురుమూర్తితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు అడుగడుగునా అపూర్వ స్వాగతం పలికారు. అభిమానంతో పూలవర్షం కురిపించారు. గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌ను ఆశీర్వదించాలని కోరారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. డిప్యూటీ మేయర్ హోదాలోనే అభినయ్ ఉన్నత ఆలోచనలతో తిరుపతిని అద్భుతంగా తీర్చిదిద్దారని, ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేస్తారని వివరించారు. ఈ క్రమంలోనే తిరుపతి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎంపీ గురుమూర్తిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం 29వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లి ఆధ్వర్యంలో అభినయ్ మా నమ్మకం, అభినయ్ మా భవిష్యత్ అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పేదల పక్షపాతి జగనన్నను మరో మారు సీఎంగా చేద్దామని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలను అందించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. తిరుపతిలో అభినయ్ చేసిన అభివృద్ధిని గతంలో ఎన్నడూ చూడలేదని ప్రశంసించారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మేయర్ శిరీష, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి నీలం బాలాజీ, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, దూది కుమారి, తిరుత్తణి శైలజ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుబాల, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పులయ్య, రఘురామ్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నేతల చేరిక

నగరంలోని 23, 29 డివిజన్లకు చెందిన టీడీపీ, జనసేన నేతలు ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో నాగరాజు, సద్దార్, ఆలీ, శాంతి, సరస్వతి, ఆదిలక్ష్మి, బిందు, వెంకటేష్ ఉన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గత 70ఏళ్లలో ఎవరూ చేయని విధంగా తిరుపతిని అభినయ్ అభివృద్ధి చేశా రని వెల్లడించారు. ఆయన ఎమ్మెల్యే అయితే తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయంలో భక్తుల రద్దీ

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆది వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్నారు. వేయి కళ్ల దుత్తలను తలపై ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ముడుపులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను ఆలయ ఈఓ నవీన్ కుమార్ పర్యవేక్షించారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



మహిళకు పర్సు అందిస్తున్న పోలీసులు

చిల్లకూరు సూళ్లూరుపేట మండలం పోతిరెడ్డిపాళానికి చెందిన మానికల రత్నమ్మ, తన భర్తతో కలిసి ఆదివారం మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ దర్శనానికి వచ్చింది. ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో చేతిలోని పర్సును ఎక్కడో పోగొట్టుకుంది. దీనిపై వెంటనే పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కానిస్టేబుల్ రఫీ గాలింపు మొదలు పెట్టి ఓ వ్యక్తి దొరికిన పర్సును స్వాధీనం చేసుకుని సీఐ వేణుగోపాల్‌రెడ్డికి అప్పగించారు. ఆయన పూర్తి వివరాలు తెలుసుకుని రత్నమ్మకు పర్సు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అంజిరెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు



వెంకటగిరి : పార్టీలో చేరిన వారితో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



తిరుపతి రూరల్ మండలంలో పార్టీలో చేరిన వారితో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



సత్యవేడు : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో నూకతోటి రాజేష్

వెంకటగిరిరూరల్ : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ , జనసేన నుంచి పలువు రు నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అందులో భాగంగా బాలాయపల్లె మండలానికి చెందిన టీడీపీ నేతలు చల్లా కోటేశ్వరనాయుడు, రమేష్‌నాయుడు, బీజేపీకి చెందిన కొవి మల్లిశ్వరిచౌదరి ఆదివారం వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నేదురుమల్లి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వలసలు పెరుగుతున్నట్లు వెల్లడించారు.వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవిక చౌదరి పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు పెరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం చంద్రగిరి మండలం డోర్నకంబాల, మడపంపల్లె, గంగుడుపల్లె, తాటికోన, చవటకాలవ, బోనకాలువ టీడీపీకి చెందిన సుమారు 150 మంది యువకులు తుమ్మలగుంట నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆయన వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. అనంతరం యువత మాట్లాడుతూ ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని వెల్లడించారు. పార్టీలో వారిలో దివాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, వీరేంద్ర, రాజేష్, గురు ప్రసాద్, కిషోర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వైసీఆర్ , గంగరాజు, బాబు రెడ్డి, కిషోర్, ప్రకాష్, రామ్ తేజ్ పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ మండలంలో..

తిరుపతి రూరల్ మండలం పైడిపల్లె టీడీపీకి చెందిన రామచంద్ర, గుర్రప్ప వైఎస్సార్‌సీపీలో చేరారు. మోహిత్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పైడిపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూకతోటి రాజేష్ సమక్షంలో..

సత్యవేడు: మండలంలోని ఏఎంపురం పంచాయతీ వీఆర్ కండ్రిగలో ఆదివారం జనసేన, టీడీపీకి చెందిన యువకులు, మహిళలు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సాయికృష్ణ, ఎం.పురుషోత్తం, రామయ్య, జె.రాము, గిరి, పంరంధామ్, సురేష్, మణి, ఎం.లోకేష్, సంధ్య, లత, పండమ్మ, శశమ్మ, ఈశ్వర్, చంద్రయ్య, మునస్వామి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, మండల కన్వీనర్ కె.సునీల్ కుమార్ రెడ్డి, నాయకులు పగడాల రమేష్, ఏపీఎం బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రావారిపాళెం మండలంలో...

ఎర్రావారిపాళెం మండలం యల్లమంద, కోటకాడపల్లె, బోడేవాండ్లపల్లె పంచాయతీలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మోహిత్ రెడ్డిని గజమాలతో సత్కరించారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేష్, శ్రీకాంత్, సుబ్బునాయక్, రెడ్డి నాయక్ , నవీన్ నాయక్, సాగర్ నాయక్, వెంకటేష్ నాయక్, సురేష్ నాయక్, ఉదయ్, సునీల్, సల్మాన్, పృథ్వీ, సంతోష్, యశ్వంత్, ఖలీమ్, కార్తీక్ ఉన్నారు.



ఎర్రావారిపాళెం మండలం నుంచి పార్టీలో చేరిన యువతతో మోహిత్‌రెడ్డి

చరిత్రలో నిలిచేలా అభివృద్ధి



మాట్లాడుతున్న మేరిగ మురళీధర్, పక్కన ఎంపీ గురుమూర్తి

కోట : చరిత్రలో నిలిచేలా అభివృద్ధి పనులు చేపట్టామని , ప్రజలు ఆదరిస్తే మరింతగా కష్టపడి సేవలందిస్తామని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆదివారం కోటలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో యువ ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ జగనన్నకు యువత అండగా నిలవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితమైందని, జగనన్న పాలనలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. విద్య,వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. రూ.130 కోట్లతో పులికాట్ ముఖద్వారం పూడికతీత పనులకు శ్రీకారం చుట్టామన్నారు. యువత ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేశామని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ మాట్లాడుతూ కన్నతల్లిలాంటి పార్టీకి ద్రోహం చేసిన పాశం సునీల్‌ను మరోసారి చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పరిశీలకుడు ఎమ్మార్సీ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడిని ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీ నిర్మాణాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, చెంగాళమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బాలచంద్రారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ అంజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ రమణయ్య, మొబీన్, షనీల్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విషతుల్యంగా ‘నక్కలవంక’



చెన్నంపల్లె వద్ద నక్కలవంక వాగు దుస్థితి

- యథేచ్ఛగా రసాయన వ్యర్థాల విడుదల
- స్థానిక పరిశ్రమలతోపాటు చెన్నై నుంచి తీసుకువచ్చి కలిపేస్తున్న వైనం
- రెడ్ హ్యాండెడ్‌గా ట్యాంకర్‌ను పట్టించినా చర్యలు శూన్యం
- కాలుష్య కోరల్లో సమీప పల్లెలు



కాలువలోకి వస్తున్న రసాయన వ్యర్థాలు

రేణిగుంట : మండలంలోని నక్కలవంక వాగు పలు గ్రామాల ప్రజల పాలిట శాపంగా మారింది. దశాబ్దాలుగా సమీప పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలతో తాగే నీరు.. పండే పంట... పీల్చే గాలి.. అన్నీ కలుషితంగా మారిపోయాయి. ఈతరుణంలో పుండుమీద కారం చల్లినట్లు ఎక్కడో చెన్నై నుంచి ట్యాంకర్‌లో తీసుకొచ్చి ప్రాణాంతక రసాయన వ్యర్థాలను ఈ కాలువలో కలిపేస్తుండడంపై బాధిత గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తూ బాధిత పల్లెవాసులే ట్యాంకర్‌ను పట్టించినా చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం అలసత్వం ప్రదర్శించడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. రేణిగుంట మండలం గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలో ప్రవహిస్తున్న నక్కలవంక వాగులో శుక్రవారం రాత్రి చెన్నైకు చెందిన ఓ ట్యాంకర్‌లో హైడ్రోక్లోరిక్ యాసిడ్ వ్యర్థాలను వదులుతుండగా స్థానికులు గమనించి పోలీసులను అప్పగించారు. ఈ క్రమంలో పోలీసులు వెంటనే కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం అందించారు. అయితే ఇప్పటి వరకు ట్యాంకర్‌లోని వ్యర్థాలను చెన్నై నుంచి ఇక్కడకెందుకు తీసుకొచ్చారు.. ఈ కాలువలో ఎందుకు కలుపుతున్నారు..? ఆ రసాయన వ్యర్థాల వల్ల ముప్పు ఏమైనా ఉందా..? అనే వివరాలను ఇటు గాజులమండ్యం పోలీసులు గానీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కానీ దర్యాప్తు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. సీఐ సుబ్బరాయుడు వివరణ ఇస్తూ చెన్నై నుంచి వచ్చిన ఆ ట్యాంకర్‌లో నుంచి కాలువలో ఏమీ కలపలేదని, ట్యాంకర్‌లో కూడా రసాయన వ్యర్థాలు ఏమీ లేవని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిర్ధారించారన్నారు. అయితే చెన్నై నుంచి ఆ ట్యాంకర్‌ను వాగులోకి ఎందుకు తీసుకెళ్లారు అనేది అంతుచిక్కడం లేదని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.. ఫ్యాక్టరీల వ్యర్థాలను విచ్చలవిడిగా వదులుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోలేదని, అందులో భాగంగానే ఈ ఘటనలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగలు చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : తిరుపతిలోని పలు ఆస్పత్రుల్లో చోరీలకు పాల్పడిన నిందితుడు దేవా మహేష్(41)ను ఆదివారం అరెస్ట్ చేసినట్లు వెస్ట్ సీఐ జయనాయక్ తెలిపారు. నగరంలోని సంజీవయ్య నగర్ కు చెందిన దేవా మహేష్ ఇటీవల స్విమ్స్, రమాదేవి ఆస్పత్రుల్లో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. నిందితుడు భారతీయ విద్యా భవన్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి రూ.6,44,500 విలువైన 129 గ్రాముల బంగారం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

విద్యార్థి హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

నాయుడుపేటటౌన్ : మండలంలోని విన్నమాల వద్ద జరిగిన 10 తరగతి విద్యార్థి భావేష్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థిపై దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరచడంతో మృతి చెందినట్లు తమ ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. ఈ మేరకు ఆధారాల కోసం డాగ్ స్క్వాడ్‌తో సైతం తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎవరికైనా ఏదైనా సమాచారం తెలుసుంటే 94407 96357 నంబర్‌కు తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు.

జగనన్నతోనే ముస్లింల అభ్యున్నతి



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు



ఎమ్మెల్యేకు స్వీట్ తినిపిస్తున్న చిన్నారి

శ్రీకాళహస్తి: సీఎం జగనన్నతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో ముస్లిం నేతలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి ఆయన హాజరయ్యారు. ప్రతి ముస్లింను ఆత్మీయంగా పలకరిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలతో అల్లాహ్‌ను ప్రార్థించే ముస్లింలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలనే ఇఫ్తార్ విందుకు హాజరై వారితో మమేకమైనట్లు వెల్లడించారు. తమ పిలుపు మేరకు 8,500 ముస్లిం కుటుంబాలు విచ్చేయం ఆనందంగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలో హిందూ, ముస్లింలు అన్యోన్యంగా ఉంటామని, ఒకరి పండుగలకు మరొకరం వెళుతుంటామని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం మైనారిటీలకు ఎంతో మేలు చేకూరిందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ముస్లింకు 4శాతం రిజర్వేషన్‌ల అమలు మొదలైందని గుర్తుచేశారు. ముస్లిం సోదరులు ఎల్లప్పుడూ తన వెంటే ఉన్నారని, నేటి విందుకు సైతం ఇంత పెద్దసంఖ్యలో రావడం సంతోషంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి శ్రీవాణిరెడ్డి, కుమార్తె పవిత్రారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నేతలు లోకేషయాదవ్, వాసుదేవనాయుడు, గోరా, ఫజిల్, పఠాన్ ఫరీద్, అన్వర్‌బాషా, అమాన్, అస్లాం, కంఠా ఉదయ్‌కుమార్, చిట్టివేలు జయగోపాల్, ఉత్తరాజి శరవణకుమార్, తీగల చిన్నా, గరికపాటి చంద్ర, చింతామణి పాండు, సాగీరాబీ, షర్మిలాఠాగూర్, షబ్బీర్, అబ్బూ, శంకర్, కోవి చంద్రయ్యానాయుడు, అంజూరు వెంకటేష్‌బాబు, సుబ్బారెడ్డి, చిలకా కృష్ణ పాల్గొన్నారు.